కథానిక

# గొట్టైతోక జీవితం

పద్మనాథ్

“ఆ చిరిగిపోయినచొక్కా యింకా ఎన్నాళ్లు తొడుగుతారు? ఈనెల్లో రెండుచొక్కాలన్నా కుట్టించుకోరాదూ?”అన్నది విమల-వంకెకు ఉన్న చొక్కా తీసి తొడక్కుంటున్న విశ్వనాథంతో.

‘అవును. ఎందుక్కుట్టించుకోకూడదూ? డబ్బుంటే’ అన్నాడు విశ్వనాథం చొక్కా-తొడుక్కుని అద్దం ముందు నిలబడి తలదువ్వుకుంటూ.

‘డబ్బెందుకుండదు? రేపు జీతంరాగానే ముందు గుడ్డకొని రెండుచొక్కాలు కుట్టించుకోండి’అన్నది విమల-అతనివంక సూటిగా చూస్తూ.

విశ్వనాథం ఆమెవంక చూడకుండానే, ‘జీతం రాగానే చేయవలసినవి యింకా చాలా వున్నాయ్’ అనేసి, చకచకా చెప్పులు తొడుక్కుని వీధిలోకి వెళ్ళాడు.

‘ఉండేవి ఉంటూనేఉంటయ్. అవన్నీ తరువాత చూసుకోవచ్చు. ముందు మీరు గుడ్డలు కుట్టించుకోండి’అంటూ తలుపువేసుకుంది విమల.

విశ్వనాథం ఒక్క-క్షణం నిలబడి చొక్కా చేతిమీదఉన్న చిరుగును చూసుకున్నాడు. ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి నడక సాగించాడు.

చొక్కా బాగానే చిరిగింది. మాసింది కూడాను. వారంరోజులనుండి తొడుగుతున్నాడు దాన్ని. బహుశా చాలా అసహ్యంగా ఉండి ఉంటుంది. లేకపోతే విమల అలా ఎందుకంటుంది? రోడ్డుమీద తలవంచుకుని నడిచే విశ్వనాథం ఒకసారి తల పైకెత్తిచూశాడు. రోడ్డుమీద నడిచే వాళ్ళందరూ రకరకాల దుస్తుల్లో చాలా అందంగా శుభ్రంగా కనిపించారతనికి. వాళ్ళందరిలోను తను-ఆ చిరిగిపోయిన చొక్కాతో-మాసిన పైజామాతో ఆవిధంగా నడవడానికి ఎంతో సిగ్గేసిం దతనికి. అందరూ తనవంక-తన చిరిగిపోయిన చొక్కాకేసి హేళనగా చూస్తూ నవ్వుకుంటున్నట్లనిపించింది.

మెదలకుండా తల వంచేసుకుని ప్రక్కనేవున్న కాఫీహోటల్లోకి ప్రవేశించి, ఒకమూల కూర్చున్నాడు. తనంటే తనకే చాలా అసహ్యం కల్గుతోంది. ఎక్కడలేని దరిద్రం పట్టుకుని పీడిస్తోంది. నెలకి దాదాపు వందరూపాయలు సంపాదిస్తున్నా, తనకీ కర్మ ఏమిటో ఎన్నిసార్లాలోచించినా అర్థం కావడంలేదు. ఎప్పుడుచూసినా ఏదో ఒక అవసరం. ఏదోఒక ఖర్చు. సరైన తిండికాని, సరైన గుడ్డలు కుట్టించుకోడానిక్కాని కానీ మిగలదు. ఎప్పుడూ అనుకుంటాడు——‘ఈనెల్లో కుట్టించుకోవాలి’ అని అంతే. జీతంరానూవస్తుంది; హారతికర్పూరంలాగా హరించుకుపోనూపోతుంది.

హోటల్లోకూర్చుని ఆలోచిస్తున్న విశ్వనాథానికి జీవితంమీద విరక్తికలుగసాగింది. ఆలోచనల్లో అంతూపొంతూలేకుండా కూర్చున్న అతనిని రెండుసార్లు ఏమికావాలని పలకరించాడు సర్వరు. మూడోసారి పెద్దగా‘సార్!’అని అరిచేసరికి ఉలిక్కిపడి చూశాడు విశ్వనాథం. ‘ఏం తెమ్మంటారు?’ అన్నాడు సర్వరు.

‘కాఫీ’అని నెమ్మదిగా సమాధానంచెప్పి, వెళ్లతూన్న సర్వరుని తేరిపార చూశాడతను. చాలా శుభ్రంగా ఉన్నాయతని దుస్తులు. నున్నగా దువ్విన క్రాప్-పైకి నీట్‌గా కట్టుకున్న లుంగీ-చకచకా సాగిపోయి కాఫీ కప్పులోకలిపి తెస్తున్నాడు. టేబిల్ మీద కాఫీ ఉంచి, బిల్లురాసి అందించాడు. వెళ్తూవెళ్తూ ఒకసారి అతని చొక్కా చిరుగును ఒకచూపుచూసి మరీ వెళ్ళాడు. విశ్వనాథం కృంగిపోయాడు. కాఫీహోటల్ సర్వర్‌గా పనిచేసే అతను——అతను తనకన్నా నయం.

పరధ్యానంగా సాసర్లో కాఫీపోసుకుని త్రాగుతోంటే చింది చొక్కామీదపడింది. చొక్కా మరీ పాడయింది. రెండుగుక్కల్లో త్రాగేసి, జేబులో రెండణాలు బిల్ చెల్లించి బయటపడ్డాడు. చొక్కా చాలా అసహ్యంగా ఉన్నది. ‘ఈ చొక్కాయింకా యెన్నాళ్లు తొడుగుతారు?’ అన్న విమలమాటలుచెవుల్లోగింగురుమంటున్నాయి.

అవును. ఎన్నాళ్లు తొడుగుతాడు? రెండు మూడు చోట్ల చిరిగితే రిపేరు జేయించాడు. అలాగే కొన్నాళ్లు గడచింది. బాగా మాసిపోతే చాకలికి వేశాడు. ఆ ఉతుకుతో అది బాగా దెబ్బతిన్నది. భుజంమీద బాగా చిరిగింది. ఇక కుట్టించినా లాభంలేదు. అలాగే వారం రోజుల్నించీ కాలక్షేపం చేస్తున్నాడు. ఇదికాక ఇంకా ఒక్కచొక్కా మాత్రమేఉన్నది. అది చాకలికి వేసినప్పుడు ఇది తొడుక్కోవలసి వస్తున్నది. ఇక లాభంలేదు. దీనిపని అయిపోయింది. ఏమైనాసరే- ఈ నెల్లో రెండు కొత్తచొక్కాలు కుట్టించుకోవాలి...

స్కూల్ టీచర్ విశ్వనాథం యీవిధంగా ఆలోచిస్తూ, చిరిగిపోయిన చొక్కాతో, మాసిపోయిన 'పైజామా'తో, తెగిపోయిన చెప్పులతో కాళ్ళీడ్చుకుంటూ స్కూల్లో ప్రవేశించాడు-

'ఏమయ్యా, ఆలస్యంగా వచ్చావ్?' అన్నాడు హెడ్ మాస్టరు.

'ఇవాళ్ళ కొద్దిగా ఆలస్యమైందండి.' అని నసిగాడు-గడియారాన్ని చూస్తూ.

'ఇవ్వాళ్ళేమిటి!—దాదాపు రోజూ ఆలస్యం అవుతూనేవుంది!' అన్నాడాయన, మొహం చిట్లిస్తూ.

తలకాయ వంచుకున్నాడు. ఏదో చెప్పబోయాడు. మాటలు గొంతుదాటి రావడంలేదు.

ఇంతలో శివరావుగారువచ్చి 'గుడ్ మార్నింగ్ సర్!' అని హెడ్మాస్టర్ గార్ని పలుకరించి, రిజిస్టర్లో 'సైన్'చేసి వెళ్ళిపోడం జరిగింది. హెడ్మాస్టర్ గారు నవ్వుతూ మాట్లాడా డాయనతో.

విశ్వనాథం తలవంచుకుని క్లాస్కి బయలుదేరాడు. శివరావు ఆలస్యంగానే వచ్చాడు. కాని ఆయన్నేమీ అనలేదు. దర్జాగా సూట్తో, నీట్గా వచ్చాడాయన! తనూ-తనవేషం—తన ఆకారంచూసి ఎవరు గౌరవంగా మాట్లాడ్తారు? వేషాన్నిబట్టి మనుష్యుల విలువల్ని నిర్ణయించే ఈ లోకంలో తానెందుకు పనికివస్తాడు?. క్లాస్లో పిల్లలకీ తనంటే అలుసైపోయింది. చెప్పింది వినరు. చదవరు. ఒకటేకాకిగోల, ఒకటే నవ్వులు. ఎందుకు వీళ్ళంతా అలా నవ్వుతారు? తన ఆకారం చూసేనా?..అంతే!.తన చిరిగిన చొక్కానీ,మాసి, కుళ్లుగుడ్డగా తయారైన పైజమానీ, తెగిపోయి వేళ్ళాడ్తున్న చెప్పుల్నీ, జిడ్డుగారే మొహాన్నీ, చింపిరిగా ఉన్న జుట్టునీ, లోపలకు పీక్కుపోయిన గుంటలుపడి, కాంతిహీనమైన కళ్ళనీ, - తలచుకుని క్రుంగిపోయాడు విశ్వనాథం. నిరర్థక జీవి, అప్రయోజకుడు, అసమర్థుడు, యీ పదాలన్నీ తనలాంటి వాళ్ళని నిర్దేశించే యేర్పడ్డాయి!

నిరర్థక జీవి!...అవును.

అప్రయోజకుడు!...నిజం.

అసమర్థుడు!...అక్షరాలా!

కాకపోతే తాను ప్రయోజకుడనీ, సమర్థుడనీ ఎవరనగలరు? పాతికేళ్ళు నిండుతున్నాయి. ఇంత వరకూ తాను జీవితంలో సాధించిందేమిటి? చదువుకునేరోజుల్లో తల్లిదండ్రుల్ని ఏం సుఖపెట్టగలిగాడు? చదువు చాలించి ఉద్యోగంలో ప్రవేశించాక తానేదో ఉద్ధరిస్తాడని వారనుకున్నారు! కాని తనుచేసిందేమిటి? తనసంపాదన తనకే సరిగా చాలనప్పుడింక వారికేం పంపిస్తాడు? పోనీ—తన్నుకట్టుకున్న పెళ్ళామైనా సుఖపడ్తోందా? ఆవిడ రెండంటే రెండుచీరల్తో కాలక్షేపంచేస్తోంది! పోనీ—తనైనా శుభ్రంగా ఉండగల్గుతున్నాడా? ఏమిటి దీనిక్కారణం? ఎప్పుడు దీనికంతం? ఎన్నాళ్లు యీ అర్థంకాని ఆవేదన?...

ఆనాడు విశ్వనాథం జీతం తీసుకుని నోట్లు లెక్కపెట్టుకుంటూ గట్టిగా నిశ్చయించుకున్నాడు- 'ఇకనుండి జాగ్రత్తగా ఉండాలి. అనవసరమైన వాటికి డబ్బు తగలేయకూడదు. పజిల్సూ, సినిమాలూ మానేయాలి...కనీసం రెండు చొక్కాలైనా కుట్టించుకోవాలి'...

బజారుకి బయల్దేరాడు. వెంకటరత్నం షాప్లో మంచి బిన్నీషర్టింగులుంటాయి. ముందు గుడ్డకొని టైయిర్కిచ్చి తరువాత మిగిలిన విషయాలాలోచించుకోవచ్చు... అన్నట్లు, యిప్పుడే విమలకి కూడా ఒక జాకెట్ గుడ్డ తీసుకుంటే బావుంటుంది. ఒక 'వైట్ డ్రిల్' పాంటుకూడా కుట్టించుకుంటే?.. తనకి పాంట్స్మాత్రం ఎన్నిఉన్నయ్? నాలుగు దాటవ్—అన్నీ లెక్కవేస్తే! ఆ నాలుగింటిలోనూ ఒక చిరగడానికి సిద్ధంగా ఉన్నది...ఇలా లాభం లేదు. మంచిడ్రస్ కుట్టించుకోవాలి. వేషం బావుం

డాలి—ఈ రోజుల్లో! నీట్‌గా పాంట్‌లోపల షర్టువేసుకుని, ఒకబూట్ కొనుక్కుని వేసుకుంటే ఎంత దర్జాగా ఉంటుంది!... వీలు చూసుకుని విమలకు రెండు మంచి చీరలు తీసుకోవాలి. ఒక మంచి వాయిల్ చీరె తీసుకుని యింటికివెళ్ళి ప్యాకెట్ విప్పి చూపిస్తే-ఎంత ఆనందిస్తుంది?...

విశ్వనాథం ఊహాగానం చేసుకుంటూ నడుస్తున్నాడు. ఎదురుగా కళ్ళజోడు పెట్టుకుని సైకిలు పైనవచ్చే గోపాలం సైకిలుదిగి పల్కరించేదాకా విశ్వనాథం అతన్ని చూడనేలేదు. గోపాలం!... గోపాలాన్ని చూడగానే—వెనక్కు తిరిగి పారి పోదామనిపించింది విశ్వనాథానికి... వాడెందుకు వచ్చాడో తెలుసు! గోపాలానికి తాను పదిహేను రూపాయలివ్వాలి. ఎలా యిప్పుడిచ్చేస్తే—చొక్కా కుట్టించుకోడమెలా?

"ఏమోయ్ గోపాలం! ఏమిటి విశేషాలు?" అన్నాడు లేనినవ్వు తెచ్చుకుంటూ.

"ఆc, ఏముందీ ... నీకోసమే వస్తున్నా!" అన్నాడువాడు నవ్వుతూ.

ఇక లాభంలేదనుకున్నాడు విశ్వనాథం. ఇవ్వక పోతే అసహ్యంగా ఉంటుంది. వీడూ యిప్పుడే కనపడాలీ! ఏడుపు వస్తోంది. అయినా నవ్వుతూ 'ఎందుకూ? నాకు గుర్తుందిగా?' అంటూ జేబు లోంచి మూడు అయిదురూపాయల కాగితాలూ తీసి గోపాలాని కందించాడు. గోపాలం నవ్వుతూ 'థాంక్స్' సమయాని కందించావ్! రేపే క్రాస్ వర్డస్ ఆఖరు తేదీ అంటూ తుర్రుమన్నాడు.

ఉత్సాహంగా వెళ్తూన్న గోపాలాన్ని చూస్తూంటే - విశ్వనాథానికి చెప్పలేనంత కోపం వచ్చింది. ఇక యీ నెలలో చొక్కాలేదు! ఎలా ఉంటుంది?

బరువుగా నిట్టూర్చి, నడక సాగించాడు. బజార్లో, చిల్లరకొట్లో యివ్వవలసిందీ, కట్టెల దుకాణంలో, వెన్న షాపులో, కాఫీహోటల్ లో ఎవరికెంత యివ్వాలో అంతా యిచ్చేసి, తేలికైన జేబుల్లో చేతులుంచుకుని యింటికి చేరాడు.

పాలమనిషీ, పెరుగుమనిషీ-యిద్దరూ డబ్బు కోసం వచ్చి కాచుకుచున్నారు. విశ్వనాథం వాళ్లని చూసీ చూడకుండా లోపల ప్రవేశించాడు.

సరాసరి వంటయింట్లోకి వెళ్ళి, జేబులో మిగిలిన కాగితాల్నీ, చిల్లరనీ విమల చేతుల్లో కుమ్మరించేశాడు.

'ఇదేమిటి! జీతం వచ్చిందా?' అన్నది విమల.

'ఊ. వచ్చింది' అన్నాడు బరువుగా.

'చొక్కాగుడ్డ కొన్నారా?'

'ముందు...వాళ్లకెంత యివ్వాలో యిచ్చేసి, యింటి అద్దె సర్దేయ్' అన్నాడు.

'ఇంటి అద్దె రెండు నెలలది యివ్వాలిగా! ఎలా సరిపోతుంది?'

'.........'

'అప్పుడే అయిపోయిందా? డాక్టరుగారి కిచ్చారా? చాకిలి నెలా ఆపడం?'

విశ్వనాథం గాంభీరంగా చూస్తూ నిలబడ్డాడు.

'పాసీ-కోమటి కొట్లో యిచ్చారా? కట్టెల వాడికీ-వెన్నకొట్లో యిచ్చారా?'

విశ్వనాథం చలించలేదు. మాట్లాడలేదు.

'మాట్లాడరేమండీ? ఏంచేశారు? పజిల్స్‌కి మళ్ళీ పంపారా? మీరెవరికో యివ్వాలంటిరి! అప్పుతీర్చారా?'

విశ్వనాథం మాట్లాడలేదు. అతనికేమీ తెలీడం లేదు. అంతా అంధకారంగా ఉంది.

విమల ఆశ్చర్యంగా ప్రశ్నించసాగింది.

'జీతం అంతా ఏంచేశారు? బియ్యం యెలా తెస్తారు? ఎలాగండీ యిలాగైతే!'

విశ్వనాథం చెవుల్లో మారుమ్రోగాయి—

'ఏంచేశారు? జీతం ఏంచేశారు?' గోడమీద తన ప్రతిబింబం ఎదురుగా నిలబడి అరుస్తోంది— 'ఏంచేశావ్? ఏంచేస్తున్నావ్?' దిక్కులన్నీ ప్రతి ధ్వనించాయి. తల్లీ, తండ్రీ నిలబడి ప్రశ్నిస్తున్నారు-

'ఏంచేస్తున్నావ్—నీ జీవితం! దమ్మిడీ మాకు పంపవేం? తగలేస్తున్నావ్ కదూ!'

'ఏంచేస్తున్నావ్? ఏంచేశావ్!' కళ్లు తిరుగుతున్నాయి విశ్వనాథానికి.

'మాట్లాడరేమండీ!' అన్నది విమల అతని దగ్గరగా వస్తూ.

ఆమెను దూరంగా తోసేస్తూ—

'ఏం చేశానా! మింగేశాను! తగలేశాను! సరేనా?' అని అరుస్తూ విసురుగా వీధిలోకి వెళ్ళి పోయాడు.

వాకిట్లో నిలబడ్డ పెరుగుమనిషీ, పాలమనిషీ అదిరిపడ్డారు.

విమల విస్తుపోయి చూస్తూ నిలబడింది.

ఆమె చేతిలోని కాగితాలు, చిల్లరా జారి క్రిందపడి కంగుమని మ్రోగాయి.

విశ్వనాథం చిరిగిపోయిన చొక్కాతో, మాసిపోయిన పైజమాతో చెప్పులులేని కాళ్ళతో-వంచిన తల యెత్తకుండా చకచకా నడువసాగాడు.

దూరంగా వెళ్తూన్న అతన్ని చూసి గడపలో నిలబడ్డ విమల దీర్ఘంగా నిట్టూర్చింది.

పాలమనిషీ, పెరుగుమనిషీ-ఏం ఆలోచించుకున్నారో ఏమో 'రేపువస్తాం లేండమ్మా!' అంటూ వెళ్ళిపోయారు.

విమల దిగాలుపడి లోపలికివెళ్ళి మంచంమీద కూర్చుని, తరుముకునివచ్చే దుఃఖాన్ని ఆపుకోడానికి వ్యర్థప్రయత్నాలు చేయసాగింది.

---

**విశ్వశాంతికి మార్గం**

# అంతర్జాతీయ న్యాయస్థానం

**యల్లంరాజు సుబ్బారావు**

ప్రపంచ శాంతిని సంరక్షించడంలో హేగ్ నగరంలో స్థాపింపబడ్డ అంతర్జాతీయ న్యాయస్థానం చాలా ప్రముఖ పాత్ర వహించింది. ప్రాక్పశ్చిమ దేశాలు తరచు కలుసుకొనే అంతర్జాతీయ సంస్థలలో అంతర్జాతీయ న్యాయస్థానం ఒకటి. అంతర్జాతీయ న్యాయాన్ని, చట్టాలను వివిధ దేశాలకు వర్తింపచేసి వారి కలహాలను తీర్చటంలో ఈ న్యాయస్థానం చాలా ముందంజ వేసింది. ఇలాంటిదే అంతర్జాతీయ న్యాయ సంఘం. (ఇన్‌టర్ నేషనల్ లా కమిషన్) కాని అంతర్జాతీయ న్యాయాన్ని చట్టాలను అమలుపరచడంలో అంతర్జాతీయ న్యాయస్థానమే ఎక్కువగా పేరు గడించుకొంది. తన ముప్పయి సంవత్సరాల జీవితంలో ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి ఈ న్యాయస్థానం చాలా కృషి సల్పింది. మొదటి ప్రపంచయుద్ధానికి పూర్వం శాశ్వత న్యాయస్థానంగానుండి (పెర్మనెంట్ కోర్టు ఆఫ్ ఇంటర్ నేషనల్ జస్టిస్) రెండవ ప్రపంచయుద్ధానంతరం అంతర్జాతీయ న్యాయస్థానంగా మారింది.

ప్రస్తుతం ఈ న్యాయస్థానంలోని న్యాయమూర్తులసంఖ్య 15. మిత్రరాజ్య సమితిలోని జనరల్ అసెంబ్లీ భద్రతాసంఘాలద్వారా (సెక్యూరిటీ కౌన్సల్) ఈ న్యాయస్థానానికి న్యాయాధీశుల (జడ్జీస్) ఎన్నిక జరుగుతుంది. 1952 సంవత్సరంలో భారతదేశం యీ న్యాయస్థానానికి ఎన్నుకోబడింది. మనదేశం తరఫున సర్ బెనిగల్ నరసింగరావుగారు న్యాయాధిపతిగా వ్యవహరించారు. ఈ ఎన్నికలలో మిత్రరాజ్యాలమధ్య ఉండే ముఠాతత్వాలు, రాజకీయ పక్షాలఒత్తిడి బాగా పనిచేస్తుంటవి. దీనికి తార్కాణంగా మొన్న సర్ జఫ్రుల్లా ఖానుగారి ఎన్నిక జరిగింది. ఎన్నిక విధానం ఎలాఉన్నప్పటికి ఇంతవరకు ఈ ఉన్నత న్యాయస్థానాన్ని అలంకరించిన న్యాయాధిపతులందరు గొప్ప న్యాయశాస్త్ర ప్రవీణులుగానుండి నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ వచ్చారు. చాలా వ్యవహారాలలో వీరు తమ మాతృదేశాలకు విరుద్ధంగాకూడా తీర్పుయివ్వడం జరిగింది. అంతర్జాతీయ వ్యవహారాలు సాధారణంగా యీ న్యాయస్థానానికి చేరటంలేదు. కొన్ని కేసులలో ఈ న్యాయస్థానం తీర్పుయిచ్చినప్పటికి, వివిధ దేశాలు దానికి అనుబంధంగా నడచుకోవడమూ లేదు. కాని వివిధదేశాలు పరస్పర కలహాలను ఈ న్యాయస్థానంలో పరిష్కారంచేసుకోవడం జరిగితే ఈ న్యాయస్థానం నిజమైనవిలువ అనాడే ప్రపంచానికి తెలుస్తుంది. ఈ న్యాయస్థానంకూడా భారతదేశాలోని న్యాయస్థానాల్లాగే పనిచేస్తుంది. ఈ ఉన్నత న్యాయస్థానంలోకూడా మెజార్టీ అభిప్రాయాలు ఉంటవి. ఈ న్యాయస్థానం యిచ్చిన తీర్పు ఆంగ్ల చట్టాలప్రకారం విధిగా నడచుకోవలసిన అగత్యం లేదు. పాతకేసులలో యిచ్చిన తీర్పులు-వానిలో చర్చింపబడిన న్యాయశాస్త్ర సిద్ధాంతాలను రాబోవు కేసులలో తప్పనిసరిగావర్తింపజేయాలని